భాగ్యమ్మ ఏడ్పులు పెడబొబ్బలు. ఇంక ఇంటి కప్పు మీద బెంగళూరు పెంక ఉన్న ఇండ్లోళ్ల పరిస్థితి మరీ అధ్వాన్నమైపోయింది. గొల్లోళ్ల లింగయ్య ఇంటి పెంకలు మొత్తం ఊడబీకినయట. ఇంగ ఎంకన్నది రేకుల ఇల్లు. ఆ రేకుల మీద ఎగిరిఎగిరి దూకుతయి. ఆ చప్పుడు వాటికి సంబరంగా అనిపిస్తదో ఏమో. మల్ల మల్ల అటూఇటూ దూకుతయి. ఇగ ఒంటరిగ ఆడోళ్లు, చిన్నపిల్లలు కనిపిస్తే వాళ్ల దగ్గర ఏమున్నా లాక్కొని పోతున్నయి. తాటిచెట్లు, ఈతచెట్ల మీదికెక్కి కల్లు మొత్తం తాగుతయి. లొట్లు పగలగొడుతున్నయి. ఇట్ల యితే లాభం లేదని.. ఓపాలి ఊరంతా కలిసికట్టుగ పోయి సర్పంచి మల్లారెడ్డికి ఫిర్యాదు చేసినరు.

''నేను ఈ ఊరి సర్పంచిని నిజమే! ఐతే నన్ను ఏం చేయమంటరు. కోతులకు కావలి ఉండమంటరా? లేక పోతే కోతులను పట్టుకొమ్మంటరా ఎట్లా..'' అని ఎగతాళిగ మాట్లాడిండు.

ఇట్ల కాదని జనమే ఒక ఉపాయం చేసినరు. 'హైదరాబాద్ దగ్గర కోతులను పట్టే టోళ్లు ఉంటరట'.. అని చెప్పి, ఇంటికి ఐదొందలు చొప్పున లక్ష రూపాల దాకా వసూలు చేసినరు.

ఆటో కట్టుకుని పోయి ఇద్దరు మనుషులను తెచ్చినరు. వాళ్ల అటు ఉరికి ఇటు ఉరికి ఓ.. యాభై కోతులను పట్టినరు.

'మీరు ఇచ్చిన యాభైవేలకు లెక్కసరిపోయింది!' అని.. యాభై కోతులను పట్టుకుని పోయినరు.

వసూలు చేసిన డబ్బుల్లో యాభైవేలు కోతులు పట్టే టోళ్లకు, ఇంకో యాభై వేలు పెద్దమనుషుల తాగుడు పేరుతో మింగినరు.

''ఇట్ల కాదు.. మన పక్కూరు రామారంలో ఒక కొండంగిని తెచ్చినరట. కొండంగిని చూస్తే.. కోతులు జడుసుకుని ఆమడ దూరం పారిపోతయట!'' అని దూదేకుల మస్తాన్ చెప్పిండు.

మరి కొండంగి యాడ దొరుకుతది అని జాడ తీస్తే.. యాడనో కర్ణాటక దగ్గర కొడంగల్ అనే ఊళ్లె కొండంగులు ఉంటయట. అందుకనే ఆ ఊరుకు కొడంగల్ అనే పేరొచ్చిందట. అది సరెగానీ ఊళ్లెకి కోతులైతే.. ఫ్రీగా వచ్చినయి కానీ.. మరి కొండంగి రాదుగద. దాన్ని కొనాలంటే యాభై వేలు కావాలంట. ఇగ మళ్ల.. ఇంటికి ఇంత అని వసూలు చేసినరు. కొండంగిని బస్సులనో, రైళ్లనో తీసుకుని రావడం కుదరదు కాబట్టి.. ఒక కారు మాట్లాడుకుని దర్జాగా తెచ్చినరు.



**'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో విశిష్ట బహుమతి పొందిన కథ.**

ఇంగ అది ఊళ్లోకి వచ్చినప్పుడు చూడాలే సందడి. ఒక బ్యాండు మేళం, డప్పులు పెట్టి డాన్సులు ఏసుకుంటూ స్వాగతం పలికినరు కొండంగికి. మన ఊరికి ఏకంగా హనుమంతుడే దిగి వచ్చినడు అని ఊరి ఆడోళ్లు.. బిందెల కొద్ది నీళ్లు ఆరబోసి.. హారతిలు పట్టిండ్రు. ఆ కొండంగి మొఖం నల్లగ.. అచ్చం జీడిగింజ ఉన్నట్టే ఉంది. దాని తోక ముల్లుగర్ర అంత.. బారెడు ఉన్నది. దాన్ని చూడంగనే చిన్నపొలగాండ్లు జడుసుకుని ఇంటికి ఉరికినరు.

ఆ కొండంగితోనే.. ట్రైనింగ్ ఇయ్యడానికి ఒక మాస్టర్ కూడా వచ్చినడు. ఆ మాస్టర్‌కు నెలకు పదివేల జీతం.. మూడు పూటలా తిండి బాధ్యత కూడా ఊళ్లో వాళ్లదేనట. ఆయన కోతులను పట్టుడు ఏమో కానీ.. ఎప్పుడు చూడు.. ఫుల్లుగా నాటుసారా తాగి.. ఆ మాస్టర్లే ఒక కల్లు తాగిన కోతిలా చిందులేసే టోడు. రెండు రోజులు కొండంగిని చూసి కోతులు భయపడి ఇంకో బజారుకు పారిపోయినయి. కొండంగి ఒక వైపు ఉంటే.. కోతులు ఇంకో దిక్కు పోయేవి. ఆ తాగుబోతు మాస్టర్.. కొండంగికి కూడా సారా అలవాటు చేసిండు. మెల్లగ సారాయి మత్తుకు అలవాటు పడ్డ కొండంగి.. మాస్టర్ రెండుగ్లాసులు తాగితే అది నాలుగు గ్లాసులు తాగేది. ఆ సారా మత్తు ఎక్కడంతో ఫుల్లుగా నిద్రపోయేది. చివరికి ఓ రాత్రి పూట.. చైన్ ఊడబీక్కొని పారిపోయింది. మూడు రోజుల తర్వాత.. సారా మత్తు దిగిన ఆ మాస్టర్..

''మీ వల్లనే నా కొండంగి పోయింది.. లక్షరూపాయలు ఇయ్యాలె!'' అని ఒకటే గోల.

చివరకు మళ్లా ఊరి జనమే తలా ఇంత వేసుకుని పదివేలు చేతిల పెడితే.. వెళ్లిపోయిండు. పోతుపోతూ రెండు పావులు సారా తాగడం మాత్రం మర్చిపోలేదు. కొండంగి పోయింది కానీ.. కోతులు మాత్రం అట్నే ఉన్నయి. మళ్ల కథ మొదటికొచ్చింది.

* * *

అందరి సంగతి ఎట్ల ఉన్న.. ఎంకన్న పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. అప్పుడే పత్తి చేనులో పిందెలు పడుతున్నయి. కోతులు చూసినయంటే పత్తి పిందెలన్నీ తెంపుతయి. అందుకనే పగటిపూట భార్య ఎల్లమ్మతో కలిసి కాపలా కాస్తున్నడు. రాత్రి పూట చేను చుట్టూ.. ఉన్న ఫెన్సింగ్ తీగకు కరెంటు వైరుతో కనెక్షన్ ఇచ్చిండు. ఆ రోజు అర్ధరాత్రి ఎందుకో ఎంకన్నకు మెలకువ వచ్చింది. నిద్ర పట్టలేదు. ఎక్కడినుంచో కోతులు అరుస్తున్న చప్పుడు వినిపించింది. కొంపదీసి పత్తిచేను దగ్గర